# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్


- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 117 | పేజీలు : 08 | ఆదివారం | 03-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

2

## ఉత్తమ్ కుమార్ రెడ్డి కేసీఆర్ కోవర్ట్

ధర్మపురి అర్వింద్

- ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్ రెడ్డి శ్రద్ధ చూపిస్తున్నారన్న అర్వింద్
- ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ మనుషులనే ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని విమర్శ
- కాళేశ్వరం కంటే ఉత్తమ్ శాఖలో ఎక్కువ అవినీతి జరుగుతోందని ఆరోపణ

## అందుకే నేను సికింద్రాబాద్ లో ఓడిపోయాను

దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు

- ఓటు చోరీ వల్లే ఓడిపోయానన్న దానం నాగేందర్
- ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని సూచన
- హైడ్రాపై తన వైఖరి మారలేదన్న దానం నాగేందర్

2




## తండ్రీకొడుకులకు సీపీ సజ్జనార్ సత్కారం

- గ్యాస్ దొంగలను పట్టించిన తండ్రీకొడుకులకు సీపీ సజ్జనార్ సత్కారం
- సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ చేస్తున్న వారిని
- పట్టించిన తండ్రీకొడుకులు
- ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందజేత
- అక్రమాలపై ప్రతిపౌరుడు ఇలాగే చైతన్యంతో
- స్పందించాలన్న సజ్జనార్

2





2

## సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు పెంపు

- ఫీజు గడువును మే 4వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం
- ఎల్లుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం
- ఆలస్య రుసుము రూ.3,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి

## అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు



- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్న రజిని
- అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని ఆరోపణ
- జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని వ్యాఖ్య

హైదరాబాద్ పల్స్,డెస్క్

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతిలోని అద్దాల మేడలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆమె మండిపడ్డారు. .....తరువాయి 2 లో

## అమ్మలా పరిణితి చెందుతానంటే ఎగతాళి చేశారు

రాష్ట్రంలో అన్ని వర్గాల రక్షణే తమ పార్టీ ధ్యేయమన్న కవిత

తాము అధికారంలోకి వస్తే పూర్తి ఉచిత విద్యను అందిస్తామని హామీ

ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందిస్తామన్న కవిత

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త రాజకీయ శక్తిగా 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)ను ఆవిష్కరిస్తూ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలోని అన్ని వర్గాల రక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలకు 'అమ్మలా' ఆలోచించే హృదయం లేదని కవిత విమర్శించారు. "నేను అమ్మలా పరిణితి చెందుతానని అంటే చాలా మంది ఎగతాళి చేశారు. కానీ అమ్మలా లాలించి పాలన చేసినప్పుడే ప్రజలకు అసలైన న్యాయం ....తరువాయి 2 లో



## భారీగా ఓటింగ్ నమోదు

బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్..

- పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్
- సాయంత్రం 5 గంటలకే సగటున 86.90 శాతం పోలింగ్ నమోదు
- తుది పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారుల అంచనా
- కేంద్ర, రాష్ట్ర బలగాల భారీ భద్రత మధ్య పోలింగ్ ప్రక్రియ పూర్తి
- మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి

హైదరాబాద్ పల్స్,డెస్క్

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయింది. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ......తరువాయి 2 లో




### హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

2

## ఇద్దరిని ఉరితీసిన ఇరాన్

- ఇజ్రాయెల్ గూఢచారులన్న ఆరోపణలతో ఇద్దరిని ఉరితీసిన ఇరాన్
- యాకూబ్ కరీంపూర్, నాసర్ బెకర్జాదే అనే వ్యక్తులకు మరణశిక్ష అమలు
- టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా సైనిక, ప్రభుత్వ సమాచారాన్ని పంపినట్టు ఆరోపణలు
- ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధ సమయంలో వీరు సహకరించినట్టు వెల్లడి
- ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన రోజే ఈ ఘటన

2



## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు..

ప్రజలు మరో 20 ఏళ్లు ఓటు వేయరు: కేటీఆర్

- రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి బాగా పెరిగిపోయిందని ఆరోపణ
- కాంగ్రెస్ అరాచకాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మండిపాటు
- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్న కేటీఆర్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి,.........తరువాయి 2 లో



## మందుబాబులకు షాక్..



### తెలంగాణలో భారీగా పెరగనున్న మద్యం ధరలు!

- తెలంగాణలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు
- ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు పెంపు అవకాశం
- పెరిగిన ఉత్పత్తి వ్యయంతో కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి
- ధరల నిర్ధారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- ఈ పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.3000 కోట్ల అదనపు ఆదాయం అంచనా

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో మద్యం ప్రియులకు త్వరలో షాక్ తగలబోతోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. పెరిగిన ఉత్పత్తి వ్యయం, డిస్టలరీల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నెలలోనే కొత్త ధరలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పెంపు అమలైతే ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు భారం పడొచ్చని అంచనా.గత ఏడాది కాలంగా మద్యం తయారీ కంపెనీలు ధరల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం, ముడిసరుకుల రవాణా ఖర్చులు, బాటిళ్ల తయారీకి వినియోగించే గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టింది. అయితే, ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరల.........................తరువాయి 2 లో

## కాంగ్రెస్ మళ్లీ
# అధికారంలోకి రాదు..

మొదటి పేజీ తరువాయి

కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు.ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఉత్తమ్ కుమార్ రెడ్డి కేసీఆర్ కోవర్ట్

మొదటి పేజీ తరువాయి



నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గ్యాస్ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను 'పిల్ల చేష్టలు'గా అభివర్ణించారు. కనీసం దుస్తులు, చెప్పులు కూడా సరిగా వేసుకోవడం తెలియని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష నేతగా ఉండటం సిగ్గుచేటంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి చేపట్టిన తర్వాత ప్రజాక్షేమం కంటే తన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. రేవంత్ పాలనలో రాష్ట్రానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'కోవర్ట్' అని సంబోధిస్తూ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే సివిల్ సప్లై శాఖలోనే భారీగా అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కూడా కేసీఆర్ మనుషులనే ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కంటే ఉత్తమ్ శాఖలో జరుగుతున్న అవినీతి పెద్దదని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అక్రమాల విషయంలో కేసీఆర్ కుటుంబాన్ని రక్షించేందుకు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

# అందుకే నేను సికింద్రాబాద్ లో ఓడిపోయాను

మొదటి పేజీ తరువాయి

ఓటు చోరీ వల్లే తాను సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుంచి ఓడిపోయానని, లేదంటే గెలిచేవాడినని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గత కొద్దికాలంగా 'ఎస్ఐఆర్' (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) అంటోందని, ఈ ప్రక్రియ తర్వాత ప్రజలు తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలని హితవు పలికారు.

హైడ్రాపై దానం నాగేందర్

హైడ్రాపై దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో తన వైఖరి మారలేదని స్పష్టం చేశారు. హైడ్రా కారణంగా పేదలకు నష్టం కలగకూడదనే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. పేదల జోలికి వెళ్లకుండా హైడ్రా తన పని తాను చేస్తే స్వాగతిస్తానని అన్నారు. సీసీ కెమెరాలు భద్రత కోసం ఏర్పాటు చేస్తామని, కానీ వాటిని ట్యాపింగ్‌గా అభివర్ణించడం సరికాదని అన్నారు. ఇచ్చిన హామీలను కాస్త ఆలస్యమైనా తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు.

# సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు పెంపు

మొదటి పేజీ తరువాయి

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువును తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఫీజు గడువును ఈ నెల 4వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు ఎల్లుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫీజును చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.అయితే లేట్ ఫీజును రూ.3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. మే 22 నుంచి 25వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

## అమ్మలా పరిణితి చెందుతానంటే
# ఎగతాళి చేశారు

మొదటి పేజీ తరువాయి



జరుగుతుంది" అని ఆమె స్పష్టం చేశారు.సామాన్యుడి ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యానికే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, తమ పార్టీ అధికారంలోకి వస్తే విప్లవాత్మక మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు పూర్తి ఉచిత విద్యను అందిస్తామని, దీనికి సంబంధించిన ఆర్థిక ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందని వెల్లడించారు.తమ ప్రభుత్వం వస్తే... క్యాన్సర్ వంటి మహమ్మారి సోకితే నిరుపేదలు ప్రాణాలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎంత ఖర్చైనా సరే ప్రభుత్వమే భరించి ప్రతి బిడ్డకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు విడుస్తుండటం తనను కలచివేసిందని కవిత అన్నారు. ధాన్యం ఎగుమతి కోసం ప్రత్యేక కమిటీ వేసి రైతులకు మద్దతు ధరతో పాటు ఆత్మగౌరవం కల్పిస్తామన్నారు.యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. 18-45 ఏళ్ల యువతకు వారి ఐడియాలజీ ఆధారంగా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామని ప్రకటించారు. సచివాలయం వంటి భారీ కట్టడాల్లో వికలాంగుల కోసం కనీసం ర్యాంప్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు.

# అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు

మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన ఆమె, జగన్ హయాంలో 66 లక్షలకు పైగా ఉన్న పెన్షన్లలో ఇప్పుడు ఏకంగా 6 లక్షల పెన్షన్లను కట్ చేశారని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు.ఒకవైపు రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఆ నిధులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తమ విలాసాల కోసం, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల ప్రయాణాల కోసం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, అడుగుకు రూ.18,500 పైనే ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా లేని విడ్డూరమని రజిని పేర్కొన్నారు. కేవలం అక్కడ అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులతో మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించవచ్చని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టి సామాన్యుడి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే అమరావతికి వ్యతిరేకం అంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని అన్నారు.

# భారీగా ఓటింగ్ నమోదు

మొదటి పేజీ తరువాయి



ఈ ప్రక్రియ జరిగింది.సాయంత్రం 5 గంటల సమయానికి 15 బూత్‌లలో కలిపి సగటున 86.90 శాతం ఓటింగ్ నమోదైంది. మగ్రాహత్ (పశ్చిమ) నియోజకవర్గంలోని 11 బూత్‌లలో 86.11 శాతం, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 బూత్‌లలో 87.60 శాతం పోలింగ్ నమోదైనట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. తుది గణాంకాలు తేలిన తర్వాత పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రీపోలింగ్‌లో ఇది చాలా అధికమని వారు పేర్కొన్నారు.ఈసారి రెండు దశల్లో (ఏప్రిల్ 23, 29) జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 93 శాతం పోలింగ్ నమోదై స్వాతంత్ర్యం తర్వాత కొత్త రికార్డు సృష్టించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు... 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికి, బీజేపీ అధికారంలోకి వస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

## తండ్రీకొడుకులకు సీపీ
# సజ్జనార్ సత్కారం

మొదటి పేజీ తరువాయి

కష్టమర్లకు న్యాయంగా చేరాల్సిన గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ చేస్తున్న దొంగలను పట్టించిన తండ్రీకొడుకులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అభినందించారు. ధైర్యంగా గ్యాస్ మాఫియా గుట్టురట్టు చేయడాన్ని కొనియాడుతూ, శనివారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేసి, పౌర చైతన్యానికి మారుపేరుగా నిలిచారని ప్రశంసించారు.సమాజంలో జరుగుతున్న అక్రమాలపై ప్రతి పౌరుడు ఇలాగే చైతన్యంతో స్పందించినప్పుడే నేరరహిత సమాజం నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు.

ఏం జరిగిందంటే?

చుడీబజార్‌కు చెందిన వ్యాపారి అశోక్ తివారీ గత నెల 21న గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేశారు. డెలివరీ సమయంలో బరువు తక్కువగా ఉండటాన్ని ఆయన కుమారుడు 16 ఏళ్ల నమాన్ తివారి గమనించారు. గత డెలివరీ సమయంలోనూ ఇలాగే సిలిండర్ రెండు కిలోలు తక్కువగా ఉందని తన తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం 30.4 కిలోలు ఉండాల్సిన సిలిండర్, కేవలం 28 కిలోల బరువు మాత్రమే ఉండటం గుర్తించారు.గత కొంతకాలంగా గ్యాస్ త్వరగా అయిపోతుండటంతో అనుమానం వచ్చి బరువు తనిఖీ చేయగా, సుమారు రెండు కిలోల గ్యాస్ తక్కువగా ఉన్నట్లు తేలింది. తనకు గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసే సిద్ధార్థ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ ప్రతినిధులను ప్రశ్నించగా వారు దురుసుగా సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. ఆ తర్వాత తండ్రీకొడుకులు గ్యాస్ తక్కువ రావడం గురించి ఆరా తీశారు. సదరు ఏజెన్సీ ఉద్యోగులు గ్యాస్ సిలిండర్లను జుమేరాత్ బజార్‌లోని ఒక ఇంట్లో అక్రమంగా చిన్న సిలిండర్లలోకి, వాణిజ్య అవసరాల కోసం రీఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు.బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం గ్యాస్ తక్కువగా ఇవ్వడమే కాకుండా, జనసమ్మర్ద ప్రాంతంలో అత్యంత ప్రమాదకర రీతిలో రీఫిల్లింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సిద్దార్థ ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీతో పాటు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసుకు సంబంధించి సాయి కుమార్, వినీత్ కుమార్, పూస గణేశ్, ప్రవీణ్ కుమార్, అమిత్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కమర్షియల్, ఏడు డొమెస్టిక్, 12 చిన్న సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.పౌర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, గ్యాస్ ఏజెన్సీల అక్రమదందాను వెలుగులోకి తెచ్చిన తండ్రీకొడుకులను సీపీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. "యూనిఫామ్ లేని పోలీసులా వ్యవహరించి, వ్యవస్థలోని అక్రమాలను ధైర్యంగా ప్రశ్నించిన వీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయులు. అక్రమార్కులు సామాన్యుల కష్టార్జితాన్ని దోచుకోవడమే కాకుండా, రీఫిల్లింగ్ పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే చూస్తూ ఊరుకోకూడదని నిరూపించారు. ప్రతి పౌరుడు ఇంతే చైతన్యంతో స్పందిస్తే నేరస్తులు సమాజంలో తలదాచుకోలేరు. ఇలాంటి బాధ్యతాయుతమైన వ్యక్తులకు పోలీసు శాఖ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుంది" అని ఆయన అన్నారు.వినియోగదారులు కూడా తమకు అందే వస్తువుల నాణ్యత, పరిమాణంపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కు పాల్పడేవారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా మోసం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 గానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# మందుబాబులకు షాక్..

మొదటి పేజీ తరువాయి

పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ధరల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ శాఖ ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చే వారం తొలిసారి సమావేశమై, వివిధ బ్రాండ్ల ధరల పెంపుపై కంపెనీలు సమర్పించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. అయితే, ధరలను భారీగా పెంచితే సామాన్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మధ్యేమార్గంగా ధరలను సవరించాలని యోచిస్తున్నారు.ప్రస్తుత అంచనాల ప్రకారం.. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్లపై రూ.100, ఖరీదైన బ్రాండ్లపై రూ.120 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరల పెంపు ద్వారా ప్రభుత్వ ఖజానాకు నెలకు అదనంగా రూ.250 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు లెక్కలు వేస్తున్నారు. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి ధరలను సవరించే ఆనవాయితీ ఉండగా.. 2023 మే నెలలో గత ప్రభుత్వం ధరలు పెంచింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇద్దరిని ఉరితీసిన ఇరాన్

మొదటి పేజీ తరువాయి

ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కోసం పనిచేశారన్న ఆరోపణలతో ఇరాన్ శనివారం ఇద్దరు వ్యక్తులను ఉరితీసింది. యాకూబ్ కరీంపూర్, నాసర్ బెకర్జాదే అనే ఈ ఇద్దరికీ సుప్రీం కోర్టు మరణశిక్షను ఖరారు చేయడంతో, న్యాయ ప్రక్రియల అనంతరం శిక్షను అమలు చేసినట్టు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌తో 40 రోజుల పాటు జరిగిన యుద్ధ సమయంలో కరీంపూర్ మొసాద్‌కు చురుకుగా సహకరించినట్టు అధికారులు తెలిపారు. దేశానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని టెలిగ్రామ్ ద్వారా ఒక మొసాద్ అధికారికి చేరవేసినట్లు పేర్కొన్నారు. సైనిక స్థావరాల వద్ద పేలుళ్లు జరపడం, వాటిని చిత్రీకరించడం, భద్రతా సంస్థలను తప్పుదోవ పట్టించడం వంటి పనులకు గాను ఇతను డబ్బులు స్వీకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి.మరో దోషి అయిన బెకర్జాదే, ఇరాన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నతాధికారులు, మత పెద్దలకు సంబంధించిన సమాచారం, ఫోటోలు, వీడియోలను వాట్సాప్, ఈమెయిల్ ద్వారా మొసాద్‌కు అందించినట్టు అధికారులు తెలిపారు. దీనికి ప్రతిఫలంగా ఇతను కూడా డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారించారు.ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించగా, ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. కాగా, కాంగ్రెస్ అనుమతి లేకుండా ప్రారంభించిన సైనిక చర్యకు 60 రోజుల గడువు ముగియడంతో ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజే ఈ ఉరిశిక్షలు అమలు కావడం గమనార్హం.

# హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు.ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇస్నాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు నాలుగు కో-ఆప్షన్ పదవులు

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు**

**ప్రతి వార్డుకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక.. పూర్తి పారదర్శకతతో నిధుల కేటాయింపు**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02 :** సమిష్టి సహకారంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో రాష్ట్ర ఆదర్శంగా తీర్చిదిద్దాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) పాలకవర్గానికి సూచించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా పనిచేయాలని, ప్రతి వార్డుకు సమాన నిధులు కేటాయించాలని కోరారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కార్యక్రమానికి హాజరై ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ తరపున ప్రతిపాదించిన విష్ణువర్ధన్ రెడ్డి, బండ సోనియా, నిజాముద్దీన్ బాబా, ఆసియా బేగం పూర్తి మెజారిటీతో కో-ఆప్షన్ సభ్యులుగా ఎంపికయ్యారు. ప్రశాంతంగా ముగిసిన ఈ ఎంపికలో బీఆర్ఎస్ ఖాతాలో నాలుగు పదవులు వచ్చాయి. అనంతర సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, ప్రతి కౌన్సిలర్ తమ వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధులుగా పనిచేయాలని సూచించారు. 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయి. అతి త్వరలో శంకుస్థాపనలు అధికార, ప్రతిపక్ష తేడా లేకుండా ప్రతి వార్డుకు సమాన



నిధులు కేటాయించాలని, ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందించాలని పాలకవర్గానికి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి అయినట్లు, త్వరలో శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు.


# కరెంట్ “లో ఓల్టేజ్” సమస్య పరిష్కార దిశగా తీసుకెళ్ళిన యువ నాయకుడు రంజీత్

**సమస్యపై స్పందించిన అధికారులు**
**రెండు రోజుల్లో పరిష్కారం**

**న్యాల్కల్, మే 02, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల పరిధిలోని న్యామతాబాద్ గ్రామ ఎస్సీ కాలనీలో గత ఆరు నెలలుగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యకు విద్యుత్ శాఖ అధికారులు శాశ్వత పరిష్కారం చూపించారు. విద్యుత్



సరఫరా లోపంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ సమస్యను కాంగ్రెస్ యువ నాయకుడు రంజిత్ సంగారెడ్డి విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యక్షంగా సమస్య వివరించి గ్రామ ప్రజల ఇబ్బందులను తెలియజేయడంతో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టారు. సమస్యపై 'ప్రత్యేక దృష్టి సారించిన



విద్యుత్ శాఖ అధికారులు రెండు రోజుల వ్యవధిలోనే ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు, విద్యుత్ లైన్ల సర్దుబాటు, అవసరమైన సాంకేతిక పనులు పూర్తి చేసి లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రస్తుతం గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడిందని, ఇళ్లలో విద్యుత్ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను పట్టించుకుని త్వరితగతిన పరిష్కరించిన విద్యుత్ శాఖ ఎస్ఈ, ఏడీ, డీఈ, ఏఈతో పాటు సంబంధిత సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన రంజిత్, సంగారెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్తును నిర్మించుకోండి: అదనపు ఎస్పీ చైతన్య పిలుపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న “బాలల భద్రత - డ్రగ్స్ రహిత తెలంగాణ” వారోత్సవాల సందర్భంగా శనివారం సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు పోలీసు సూపరింటెండెంట్ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక సామర్థ్యాలు దెబ్బతిని భవిష్యత్తు నాశనం కావచ్చని హెచ్చరించారు. యువత తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై ఏకాగ్రత పెంచుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు వంటి ఆధునిక సమస్యలపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ యువత డ్రగ్స్ ప్రమాదాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం డీఎస్పీ పుష్పస్ కుమార్,




సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, సత్తయ్య, డీసీపీఓ రత్నం, ఏఎఫ్‌డబ్ల్యూఓ సతీష్, లింగం, యాదగిరి, డీసీపీఎస్ సిబ్బంది, ఓమేరా తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా,



క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐ పులి వెంకట్ కీ ఘన సన్మానం

**దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు**




**జమ్మికుంట, మే 02( హైదరాబాద్ పల్స్) :** జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ లో హుజురాబాద్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీ పై జమ్మికుంట కు వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పులి వెంకట్ ని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి రాములవారి ముత్యాల తళంబ్రాలు అందజేసి స్వామి వారి మేమేంటోను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు సిఐ ని దేవస్థానంకు రావాల్సింది గా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


# నూతనంగా బాధ్యతలు స్వీకరణ

**మున్సిపల్ కమిషనర్ కి ఘనంగా సన్మానం**



**జమ్మికుంట, మే 02 (హైదరాబాద్ పల్స్):** జమ్మికుంట మున్సిపాలిటీ కి నూతనంగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన కమిషనర్ ల బదిలలో శనివారం నూతనంగా బదిలీపై వచ్చిన గుట్టల మల్లికార్జున స్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి టిపివో శ్రీధర్ టిపిఎస్ రాజ్ కుమార్ టిపిబివో దీపిక శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్ ఆర్ ఐ భాస్కర్ సీనియర్ అసిస్టెంట్ వాణి శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో నీట్ పరీక్షల కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ పరితోష్ పంకజ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** మే 3న నిర్వహించనున్న నీట్-యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో, సంగారెడ్డి జిల్లాలోని 6 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లాలో గుర్తించిన 6 పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. మొత్తం 2,292 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 వరకు ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులుగా గుమిగూడటాన్ని నిషేధించినట్లు ఎస్పీ వెల్లడించారు. పరీక్ష కేంద్రాలన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకంపై కఠిన ఆంక్షలు విధించినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డ్‌తో పాటు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో తప్పనిసరిగా తీసుకురావాలని సూచనలు జారీ చేశారు. పారదర్శక వాటర్ బాటిల్ మినహా ఇతర వస్తువులు, నగలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షూస్, సాక్స్ అనుమతించబడవని స్పష్టం చేశారు. పరీక్షా సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చిన వారికి ప్రవేశం కల్పించబడదని ఎస్పీ సూచించారు. అభ్యర్థులు ఆందోళన చెందకుండా, నిబంధనలు పాటిస్తూ పరీక్ష రాయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ, డీయస్పీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంచలన పరిణామం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్ మే 02, సెంట్రల్ డెస్క్:**
కర్ణాటక అసెంబ్లీలో అత్యంత వివాదాస్పద శాసన సభ్యుడు వినయ్ కులకర్ణి పై అనర్హత వేటు పడింది. ఈ మేరకు కర్ణాటక శాసనసభ సచివాలయం శనివారం అధికారిక నోటిఫికేషన్ ను విడుదల చేసింది. ఒక క్రిమినల్ కేసులో కోర్టు ఆయనను దోషిగా తేల్చడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగళూరులోని ప్రత్యేక కోర్టు వినయ్ కులకర్ణిని దోషిగా నిర్ధారించింది. కోర్టు తీర్పు వెలువడిన తేదీ అయిన ఏప్రిల్ 15, 2026 నుంచి ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 8, రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఇ) ప్రకారం, జైలు శిక్ష పూర్తయిన తర్వాత మరో ఆరేళ్ల పాటు ఆయన ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుండదు.వినయ్ కులకర్ణి పై అనర్హత వేటు పడడంతో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ధార్వాడ్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు శాసనసభ కార్యదర్శి ఎం.కె. విశాలాక్షి ప్రకటించారు. ఒకవేళ ఉన్నత న్యాయస్థానం ఈ శిక్షపై స్టే విధిస్తేనే ఆయనకు ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. ఈ మేరకు నోటిఫికేషన్ కాపీలను భారత ఎన్నికల సంఘం, ఇతర ఉన్నతాధికారులకు సమాచారం కోసం పంపారు. దీంతో కొద్ది రోజుల్లోనే ధార్వాడ్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ పరిణామం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తీవ్ర సమస్యలు తెచ్చిపెట్టిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై ఇరాన్ దాడి: 12 మంది సురక్షితం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02 :**
ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న భారతీయ సిబ్బంది ఉన్న రసాయన ట్యాంకర్‌పై ఇరాన్ తీరరక్షక దళం దాడి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, నౌకలోని 12 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది. టోగో దేశపు జెండాతో ఒమన్ దేశంలోని షినాస్ ఓడరేవు సమీపంలో ప్రయాణిస్తున్న ఎమ్.టి సిరాన్ అనే రసాయన ట్యాంకర్‌ను ఇరాన్ తీరరక్షక దళం అడ్డగించింది. ఈ క్రమంలో హెచ్చరిక కాల్పులు జరిపినట్లు సమాచారం.ఈ నెల 25వ తేదీన, ఇతర నౌకలతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో ఉన్న 12 మంది భారతీయ సిబ్బంది క్షేమంగా ఉన్నారని అధికారులు ధృవీకరించారు. దాడికి గల కారణాలపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అంతర్జాతీయ జలాల్లో ఇటువంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఈ సంఘటనపై నిఘా ఉంచింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## జన్ మన్ కార్యక్రమం...
### కొలంగూడాలో పివిటిజి సర్వే పరిశీలన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే02, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరామెరి మండలం ఝరి కొలంగూడా గ్రామంలో జన్ మన్ కార్యక్రమం కింద పివిటిజి (ప్రత్యేక అభివృద్ధి అవసరమైన గిరిజన వర్గాలు) సర్వే పనులను శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి రాథోడ్ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.సర్వే నిర్వహిస్తున్న ఎనుమెరేటర్లకు సూచనలు ఇస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా, తప్పులు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కోఆర్డినేటర్లకు కూడా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ జాదవ్, ఎనుమెరేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

### మండల టాపర్ గా నిలిచిన
## గుల్లెన తేజస్వి కి సత్కారం

**నూరు శాతం ఉత్తీర్ణతతో పలువురి ప్రశంసలు**

**500 లకు పైగా మార్కులు సాధించిన 9 మందిలో 8మంది అమ్మాయిలే**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూది వెంకటాపురం ఉన్నత పాఠశాల ఎస్ఎస్సి ఫలితాలు అమ్మాయిల వల్ల అద్భుతంగా రావడంతో పాటు మార్కుల వరద పారింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ మధు విద్యార్థులకు నేర్పిన క్రమశిక్షణ, ఆటలతో పాటు విద్యపై ఆసక్తి పెంచడం వల్ల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషి ఫలితంగా చక్కటి ఫలితాలు వచ్చాయి. 2025 – 26 విద్యా సంవత్సరంలో 29 మంది విద్యార్థులు ఎస్ఎస్సి పరీక్షలో హాజరై నూరు శాతం ఉత్తీర్ణతతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. అంతేకాకుండా రాజపేట మండలంలో నాలుగవ స్థానంలో ఇదే పాఠశాలకు చెందిన గొల్లెన తేజస్విని 564 మార్కులతో నిలిచింది. 8 మంది విద్యార్థులు గుల్లెన తేజస్విని, సంజన, సుస్మిత, ప్రసన్న, మధుప్రియ, శ్రీలేఖ, నవనీత, వర్షిత్ , మహాలక్ష్మి లు 500 మార్కులకు పైగా దక్కించుకొని ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్ విజయలక్ష్మి తో పాటు ఉపాధ్యాయ బృందం నరసింహ చారి ఫిజికల్ సైన్స్, వెంకటేశ్వర్లు హిందీ, రవీందర్ బయో సైన్స్ , శ్రీనివాస్ సోషల్, ఎలంధర్ రెడ్డి గణితము, కనకయ్య గణితము, మధు ఫిజికల్ ఎడ్యుకేషన్, విజయ్ తెలుగు, మౌనిక ఇంగ్లీష్ సబ్జెక్టులను చక్కగా బోధించడం నిత్యం పర్యవేక్షణ చేయడం ఫలితాలకు ప్రధాన కారణమైంది. డీఈవో కందుల సత్యనారాయణ ఎంఈఓ చందా రమేష్ స్థానిక ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపొద్దని చక్కటి విద్యాబోధన క్రమశిక్షణ ఫలితాలను అందిస్తున్న దూది వెంకటాపురం ఉన్నత పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఈ సందర్భంగా కోరారు. 500 మార్కులకు పైగా సాధించిన 9 మందిలో 8 మంది అమ్మాయిలే కావడం విశేషం.

## ఆలేరులో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పాము అనిత కుమారుడు శివ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆలేరు పట్టణంలోని కొంచెం ఆంజనేయులు మాతృమూర్తి మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆలేరు పట్టణంలోని గంప మనోహర్ మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆలేరు పట్టణంలోని కాంటెస్టెడ్ కౌన్సిలర్ సుఖ పరశురామ్ మృతి చెందడంతో వారి కుటుంబాన్నీ పరామర్శించి వారి పిల్లలకు అండగా ఉంటామని చెప్పి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహణ... కలెక్టర్ అనురాగ్ జయంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో, ఆయా ఆర్‌డీఓ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్‌డీఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ, అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వినతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఇకపై ఎన్‌ఐసీ పోర్టల్‌కు బదులుగా సీజీజీ ప్రజావాణి పోర్టల్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వినతిదారునికి యూనిక్ రిఫరెన్స్ నంబర్‌తో రసీదు అందజేస్తారని, దాని ద్వారా వినతి స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చన్నారు. అధికారులు వినతులను 30 రోజుల్లోగా పరిష్కరించి నివేదికలను పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఆలస్యమైతే కేసులు ఉన్నతాధికారులకు పంపబడతాయని హెచ్చరించారు. ప్రజలు సీజీజీ ప్రజావాణి పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు త్రాగునీరు, కూర్చునే సదుపాయం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు

## బదిలీపై వెళుతున్న కమిషనర్ కు వీడ్కోలు సమావేశం



**జమ్మికుంట, మే 02 ( హైదరాబాద్ పల్స్):**
గత రెండు సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ను మున్సిపల్ అధికారులు సిబ్బంది శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కమిషనర్ మహమ్మద్ అయాజ్ గత రెండు సంవత్సరాల కాలంలో జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగాలలో ముందుంచి జమ్మికుంట పట్టణ పేరును రాష్ట్రంలో పరిచయం చేసిన వ్యక్తి అని మున్సిపల్ అధికారులు కొనియాడారు. పట్టణంలో ఇంటి పన్ను వసూళ్లలో రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలిపిన వ్యక్తి అని వారు అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి జె. ఏ. వో రాజశేఖర్ రెడ్డి టిపివో శ్రీధర్ టిపిఎస్ రాజ్ కుమార్ ఆర్ ఐ భాస్కర్ సీనియర్ అసిస్టెంట్ వాణి శ్రీనివాస్ లతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, నారాయణఖేడ్ :**
ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ పారదర్శకంగా అందేలా మరియు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. శనివారం నాడు స్థానిక సాయి బాబా ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గం లోని అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపాటు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కె. హరిత అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని, రూ.500కే గ్యాస్ అని చెప్పి ఒక్క లబ్ధిదారుడికీ పూర్తి ప్రయోజనం కల్పించలేదని ఆరోపించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నారని, నియోజకవర్గానికి నిధులే రావడం లేదని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో ఏ పని పూర్తి కాలేదని నిలదీశారు."ప్రజాప్రతినిధులకు గౌరవం లేని చోట మేము ఉండలేము" అని మాట్లాడుతుండగా ఆర్ డి ఓ జోక్యం చేసుకుని సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు. దీంతో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మిషన్ భగీరథ పైప్ దెబ్బతినడంతో మూడు గ్రామాలకు నీటి సరఫరా బంద్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆసిఫాబాద్ మండలం కౌడన్ మొవాడ్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్ రెండు చోట్ల దెబ్బతినడంతో దాబాగూడ, కొలం గూడ, గోండ్ గూడ గ్రామాలకు మూడు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేసినా పరిష్కారం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు

## తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, మెయిన్ డెస్క్ :** తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎలా దోచుకుంటుందో మనందరం చూస్తున్నాం.. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో దోచుకుని దాచుకునే పరిస్థితి దాపురించిందని.. వీళ్లకు తెలంగాణ అభివృద్ధిపై దృష్టి లేదన్నారు. పొద్దున లేచింది మొదలు సాయంకాలం వరకు అప్పులు ఎలా తేవాలా..! ఏ రకంగా దోచుకోవాలా..! ఏ రకంగా భూములు కబ్జా చేయాలి..! అనే ఆలోచననే తప్ప ఈ రెండు పార్టీలకు వేరే ఆలోచన లేదన్నారు. 12 సంవత్సరాల నుండి 12 లక్షల కోట్లు రూపాయలు ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణను మోసం చేశాయన్నారు. ఈ రోజు రాష్ట్ర పరిస్థితి చాలా భయంకరమైన స్థితిలో ఉందని.. అప్పులోల్లు ఆర్థిక శాఖ ఆఫీస్ ముందర ధర్నా చేసే పరిస్థితి వచ్చిందని.. వారి నుంచి బయటపడాలంటే సెక్రటేరియట్‌లో ఆర్థిక శాఖ మంత్రి భట్టి కార్యాలయం ముందర పోలీసులను కాపలా పెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎటు పోతుంది..? 2014 సంవత్సరంలో మిగులు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రం.. ముందు చూపు లేకుండా ఎవరికి వారు దోచుకొని దివాలా తీయిస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు.

## మల్లికార్జున రైస్ మిల్లు ను ఆకస్మికంగా తనిఖీ చెసిన ప్రభుత్వ విప్ బీర్ల, ఎంపీ చామల




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కలిసి ఆలేరు పట్టణంలో ఉన్న మల్లికార్జున రైస్ మిల్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్ వద్ద పెద్ద ఎత్తున ధాన్యం లోడులతో ఉన్న లారీలను చూసి వెంటనే ఎక్కువమంది హమాలీలను పెట్టి రైస్ మిల్లులో నిల్వ చేయాలని వెంటనే ఆ లారీలను గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు పంపించాలని రైస్ మిల్ యజమానితో మాట్లాడారు. అనంతరం ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి పెద్ద ఎత్తున వచ్చిన దాన్యం రాశులను సందర్శించారు అక్కడి హమాలీలతో రైతులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఏ రైతుకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాలుగా సహాయాలు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

**ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని కమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ. 6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండగా నిలుస్తోందని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 86 మందికి రూ. 86.09 లక్షల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆకాంక్షిస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ. 5.25 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసా అని, నియోజకవర్గంలోని 72 మంది బాధితులకు రూ. 35 లక్షల విలువైన వైద్య సహాయం మంజూరైందని వివరించారు. ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి అని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గం లోని ప్రతి పేదవాడి కష్టంలో పాలుపంచుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధు కమిషనర్ సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల ఎమ్మార్వో పుల్లయ్య, ఎంపీడీవో సుభాషిణి, ఎమ్మార్వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ జయశ్రీ కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల

# కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**ప్రజా సమస్యలపై అధికారులను నేరుగా ఆదేశించిన అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వెంటనే కేటాయించాలని**






**జమ్మికుంట, మే 02 ( హైదరాబాద్ పల్స్) :** హుజురాబాద్‌లోని సిటీ సెంటర్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై అధికారులను నేరుగా ఆదేశించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేదలకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు వెంటనే కేటాయించాలని ఇళ్ల ఎంపికలో ఎమ్మెల్యేను కూడా భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులు లేకపోవడం, మందుల కొరత తీవ్రంగా ఉండటంపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ అమృత్ పథకం కింద ఉన్న రూ. 33 కోట్ల నిధులతో పనులు ఆలస్యం చేయకుండా ఎమ్మెల్యే ప్రతినిధులతో సమన్వయం చేసుకుని వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. హుజురాబాద్ క్యాంప్ ఆర్ టి ఓ ఆఫీస్ ఎం జె పి స్కూల్‌లకు నీటి కనెక్షన్ మోరి సదుపాయం లేకపోవడం పై సంబంధిత అధికారులను ఆదేశించారు. వీణవంక మండలంలోని మామిడాలపల్లి కోర్కల్, నాగంపేట్. బూజునూర్ రోడ్ల మరమ్మతులు తక్షణమే ప్రారంభించాలని సూచించారు. కమలాపూర్ బస్టాండ్ మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను హెచ్చరించారు ఇల్లంతకుంటలో మక్కల కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఇల్లంతకుంటలో నిన్న ప్రారంభించిన రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారుల కుసూచించారు. జమ్మికుంట హుజురాబాద్ మున్సిపాలిటీలకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని స్పష్టం చేశారు. కెసిఆర్ కిట్టు పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని లేకుంటే పేరు మార్చి అయినా అమలు చేయాలనిసూచించారు. హుజురాబాద్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని అధికారులకు తెలియజేశారు. నేతన్న భద్రత పథకం కింద 5 కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షలు అందజేశారుఆర్థిక పునరావాస పథకం కింద 2 కుటుంబాలకు ఒక్కొక్కరికి 75 వేల చొప్పున మొత్తం 1.50 లక్షలు అందజేశారు 7 మంది అనాథ పిల్లలకు అనాథ సర్టిఫికెట్లు ఎమ్మెల్యే స్వయంగా అందించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని అధికారులను కోరుతూ వివరించారుమహాలక్ష్మి పథకం మహిళలకు నెలకు 2500, గ్యాస్ సిలిండర్ 500కిరైతు భరోసా రైతులకు సంవత్సరానికి 15,000, వ్యవసాయ కూలీలకు 12,000 సహాయంగృహ జ్యోతి ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ఇందిరమ్మ ఇల్లు పేదలకు గృహ నిర్మాణానికి ?5 లక్షల వరకు సహాయంయువ వికాసం నిరుద్యోగ యువతకు నెలకు 4,000 భృతిచేయూత పింఛన్లు వృద్ధులు వికలాంగులకు 4,000 వరకు పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారుప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి ఆలస్యం అసలు సహించంఅని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు సంక్షేమ చర్యలు కూడా చేపట్టారుప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారుఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ ఎంపీడీవో లు ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక తాత్కాలికంగా వాయిదా

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**






**జమ్మికుంట, మే 02 ( హైదరాబాద్ పల్స్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించవలసిన కోఆప్షన్ ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి కో ఆప్షన్ పోటీకి వచ్చిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగి ఉండడంతో పాటు వారి అనుభవాన్ని పరిగణలోనికి తీసుకొని సామాజిక సమతుల్యత పాటించవలసిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించే విధంగా విధంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి 19 మంది అభ్యర్థులు ఉండడం వల్ల ఎన్నిక ప్రక్రియలో కీలకమైన ఎ పిక్ ధ్రువీకరణను సక్రమంగా పారదర్శకంగా నిర్వహించడం కోసం సమయం తీసుకోవాల్సి వచ్చింది అన్నారు. ఎన్నిక ప్రక్రియలో ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తోపాటు సీనియర్ నాయకులతో చర్చించి వారి సలహాలు సూచనలు తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పాలకవర్గం మీద ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రధాన లక్ష్మన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసి కో ఆప్షన్ ఎన్నికను పారదర్శకతతో నిర్వహిస్తామని చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

# భారతదేశ ఇంధన విధానాన్ని ప్రశంసించిన పాకిస్థాన్ మంత్రి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02 :** అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, పెట్రోల్ ధరలను స్థిరంగా ఉంచడంలో భారతదేశం అనుసరిస్తున్న విధానాన్ని పాకిస్థాన్ పెట్రోలియం మంత్రి అలీ మాలిక్ ప్రశంసించారు. భారతదేశం యొక్క వ్యూహాత్మక ఇంధన నిల్వల నిర్వహణను ఆయన అభినందించారు. పాకిస్థాన్ పెట్రోలియం మంత్రి అలీ మాలిక్, అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో భారతదేశం తన ఇంధన ధరలను అదుపులో ఉంచగలిగిన తీరును ప్రశంసించారు. భారతదేశం వద్ద ఉన్న వ్యూహాత్మక చమురు నిల్వలు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాయని ఆయన పేర్కొన్నారు. భారతదేశం 60-70 రోజుల వరకు సరిపడా చమురు నిల్వలను కలిగి ఉందని, అవసరమైనప్పుడు ఈ నిల్వలను విడుదల చేసే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్ వద్ద కేవలం 5-7 రోజుల సరఫరా మాత్రమే అందుబాటులో ఉందని, ఇది దేశాన్ని అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులకు గురి చేస్తుందని ఆయన వివరించారు. భారతదేశం ధరల పెరుగుదలను తగ్గించడానికి పన్నులను తగ్గించడం వంటి చర్యలు తీసుకుందని, అయితే ఆ విధమైన ఆర్థిక వెసులుబాటు తమకు లేదని మంత్రి అలీ మాలిక్ అన్నారు. భారతదేశం యొక్క ఈ విధానం వినియోగదారులను ధరల షాక్ నుండి రక్షించడంలో సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో భారతదేశం యొక్క వ్యూహాత్మక ప్రణాళిక మరియు సమర్థవంతమైన నిర్వహణ సామర్థ్యాలను సూచిస్తున్నాయి.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యల వెల్లువ.. తీవ్ర ఆగ్రహంలో రైతులు


## కురవి కేంద్రంలో పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 02, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** కురవి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలిస్తూ, రైతులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ సమస్యలను వెల్లడిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని, తూకాల్లో అసమానతలు ఉన్నాయని, తేమ శాతం పేరుతో ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చెల్లింపులు సమయానికి అందకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యాన్ని కాపలా కాయాల్సి వస్తోందని, అనుకోని వర్షాలు పడితే పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. ఈ పరిస్థితులపై స్పందించిన డీఎస్ రెడ్యా నాయక్, రైతులు పడుతున్న కష్టాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేసి, పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అధికారులను కోరారు. తూకాల్లో అవకతవకలు లేకుండా చూడాలని, తేమ శాతం పేరుతో అన్యాయం చేయకూడదని స్పష్టం చేశారు. రైతులకు సమయానికి చెల్లింపులు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో పంట పండిస్తుంటే, కొనుగోలు దశలో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావడం బాధాకరమని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రైతుల తరఫున మరింత బలమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజ్జూరి పిచ్చి రెడ్డి, తోట లాలయ్య, బాధావత్ లక్ష్మిరాజు నాయక్, నూతక్కిన నరసింహారావు, పెద్ది వెంకన్న, నామ సైదులు, గుగులోత్ రాంలాల్, భరత్, బానోత్ రమేష్, భోజు, యతీరాజ్, నరసయ్య, మంగీలాల్, సాంబశివరావు, సుధాకర్, సృజన్ తదితరులు మరియు బీఆర్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి రక్తంతో రాసిన లేఖ

**జమ్మికుంట, మే 02 ( హైదరాబాద్ పల్స్):** అన్ని రాజకీయ పార్టీ నాయకులు కలిసి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి హుజురాబాద్ డంపింగ్ యాడ్ సమస్యను తీసుకొని వెళ్లి ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు హుజురాబాద్ ప్రజల వెంట నాయకులు ఉండాలి. హుజురాబాద్ ప్రజలు పత్తి నాయకునికి దగ్గర తీసుకొని ఆ నాయకులకు రాష్ట్రస్థాయిలో వారిని గుర్తింపు వచ్చినట్లు చేసిన ప్రజల వెంట నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ భారత రాష్ట్ర సమితి హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు ఇప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ మరియు రవాణా శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయిన్పల్లి వినోద్ కుమార్ మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వి ప్రణవ్ బాబు లాంటి నాయకులందరూ కలిసి డంపింగ్ యార్డ్ రద్దు కొరకు తమ వంతు ప్రయత్నం చేయాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వీరందరికీ విజ్ఞప్తి చేస్తూ శనివారం రోజు తన రక్తముతో లేఖ రాసి వారందరికీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రక్తముతో రాసిన లేఖలో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉంటుందని చెత్త నిలువ చేయటం వలన దుర్వాసన గాలి కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ కారణముగా భూగర్భ జలాలు కాలు శాతం అయ్యి త్రాగు నీటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అంతేకాకుండా దోమలు ఈగలు వృద్ధి చెంది అంటూ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి ముఖ్యంగా చిన్నపిల్లలు గర్భిణీలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం ఉంటుందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. హుజరాబాద్ ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని తన లేఖలో ముజాహిద్ హుస్సేన్ కోరారు.



# నిజం మాట్లాడిన కానిస్టేబుల్‌పై వేటు: కోల్‌కతా పోలీసు వ్యవస్థలో కలకలం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, సెంట్రల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న మతమార్పిడులపై, రాజకీయాలపై తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేసిన కోల్‌కతా పోలీసు కానిస్టేబుల్ రామకృష్ణ కాయల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ చర్య దేశవ్యాప్తంగా వాక్ స్వాతంత్ర్యంపై చర్చకు దారితీసింది. కోల్‌కతా ఆర్మ్డ్ పోలీస్ ఫస్ట్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ రామకృష్ణ కాయల్, తన 23 ఏళ్ల సర్వీస్‌లో భాగంగా ఇటీవల ఒక వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియోలో, పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న మతమార్పిడుల ప్రక్రియ, వాటి వెనుక ఉన్న రాజకీయ కోణాలపై ఆయన తన అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించాయి. కానిస్టేబుల్ కాయల్ పోస్ట్ చేసిన వీడియో కొద్ది గంటల్లోనే ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. ఈ పరిణామంతో అప్రమత్తమైన ప్రభుత్వం, మత సామరస్యాన్ని దెబ్బతీసేలా వీడియో ఉందని ఆరోపిస్తూ, ఆయనను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈ చర్య పోలీసు వ్యవస్థలో పారదర్శకత లోపాన్ని ఎత్తిచూపుతోందని, ప్రశ్నించే అధికారులకు రక్షణ లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేసే పోలీసు అధికారులకు ఇలాంటి శిక్షలు విధించడం ఏ రకమైన పాలనకు నిదర్శనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. 23 ఏళ్ల పాటు ప్రభుత్వానికి సేవ చేసిన ఒక నిజాయితీగల అధికారిని, కేవలం నిజం మాట్లాడినందుకు సస్పెండ్ చేయడం అత్యంత బాధాకరమని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. సరైన నాయకత్వ లోపం వల్లే సమాజంలో అరాచకాలు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సంఘటన దేశంలో వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య విలువలకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వాలు, అధికారులు ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఉందని, నిజాలను నిర్భయంగా చెప్పే వారికి అండగా ఉండాలని పలువురు కోరుతున్నారు. కానిస్టేబుల్ కాయల్ సస్పెన్షన్‌పై మరింత స్పష్టత రావాల్సి ఉంది.




# భారత్ కు పాకిస్థాన్ గుడ్ న్యూస్..? సంక్షోభం వేళ భారీ ఉపశమనం..!!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఇరాన్- అమెరికా యుద్ధం కారణంగా ఆ రెండు దేశాలతోపాటుగా ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు వాణిజ్యానికి గుండెకాయగా ఉన్న హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన తరుణంలో అనేక దేశాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇందులో పేద, మధ్యతరగతి దేశాలతోపాటుగా అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఉన్నాయి. ఇక అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న పాకిస్థాన్ లో పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అక్కడి పరిస్థితి మరింతగా దిగజారింది. ఆ దేశంలో ఇప్పుడు చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. అయితే హోర్ముజ్ జలసంధి నిలిపివేత కారణంగా పాకిస్థాన్ కు ఇరాన్ కు మధ్య చమురు రవాణాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ తో రోడ్డు మార్గం ద్వారా వాణిజ్యాన్ని ప్రారంభించింది పాకిస్థాన్. హోర్ముజ్ దిగ్బంధనం నేపథ్యంలో ఇరాన్ తో రోడ్డు వాణిజ్య మార్గాలను పాకిస్థాన్ ప్రారంభించింది. ఈ మేరకు ఇరాన్ నుంచి రోడ్డు మార్గం ద్వారా పాకిస్థాన్ కు ముడి చమురు చేరుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్, ఇరాన్ మధ్య దాదాపు 900 కిలోమీటర్ల పొడవైన ఉమ్మడి సరిహద్దు ఉంది. క్వెట్టా నుంచి జాహెదాన్ మధ్య 732 కిలోమీటర్లు ఉంది. ఇది ఇరు దేశాల మధ్య ప్రధాన రోడ్డుమార్గం. అలాగే గ్వాదర్ నుంచి చాబహార్ 210 కిలోమీటర్లుగా ఉంది. ఇది తీర ప్రాంత రోడ్డు మార్గం. అలాగే తఫ్తాన్- మీర్జావే, గబ్ద్- రిమ్దాన్, మండ్- పిషిన్, చాద్గి- కుహక్ రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఇక హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం, సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశ ఇంధన భద్రతను కాపాడుకోవడం కోసం పాకిస్థాన్ ఈ ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని ఎంచుకుంది. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్ పై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు రవాణా మెరుగుపడితే అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు స్థిరపడే అవకాశం ఉంది. చమురును భారీగా దిగుమతి చేసుకునే భారత్ కు ధరల స్థిరీకరణ కారణంగా భారత్ కు పరోక్షంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే భారత్ ఎప్పుడూ అంతర్జాతీయ నిబంధనలకు కచ్చితంగా పాటిస్తుంది. దీనివల్ల ఇరాన్ నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం భారత్ వద్ద వ్యూహాత్మక చమురు నిల్వలు 64 శాతం మాత్రమే నిండి ఉన్నట్లు ఇటీవల పార్లమెంటులో కేంద్రం స్పష్టంచేసింది. మొత్తం 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి గాను ప్రస్తుతం భారత్ వద్ద 3.37 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు నిల్వ ఉన్నట్లు పేర్కొంది.



# వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ తరలింపుపై మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన వొడితల ప్రణవ్, జేఏసీ నాయకులు

## - మంత్రికి వినతిపత్రం అందజేసిన నాయకులు



**జమ్మికుంట, మే 02 ( హైదరాబాద్ పల్స్):** హుజురాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో ఏర్పాటు చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ తరలింపునకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబు ను కోరారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్,జేఏసీ నాయకులు, హుజురాబాద్ ప్రాంత నాయకులు. ఈ మేరకు శనివారం సచివాలయంలోని శ్రీధర్ బాబు కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో, హుజురాబాద్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ప్రణవ్. సమస్యపై పూర్తిగా వివరించిన నాయకులు వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి తరలింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, హుజురాబాద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు పత్తి అనిత- కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు,జేఏసీ నాయకులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, హుజురాబాద్ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికతో అర్హులందరికీ సంక్షేమం : ఎమ్మెల్సీ దండే విఠల్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో శనివారం సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. అర్హులైన ప్రతి పేదవారికి పారదర్శకంగా పథకాలు అందించడమే లక్ష్యంగా 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూన్ 12 వరకు కొనసాగుతుందని, జూన్ 2 నాటికి క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హతే ప్రమాణమని, రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. జగన్నాథపూర్ ప్రాజెక్టు పునరుద్ధరణ వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. గంజాయి, ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులకు బోనస్ వివరాలు తెలియజేసి, సహజ వ్యవసాయం ప్రోత్సాహంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మాఘ పూర్ణిమ సందర్భంగా సామూహిక పారాయణం

## జై శ్రీమన్నారాయణ సభ్యురాలు బిర్రు ఇంట్లో ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మాఘ పూర్ణిమ పురస్కరించుకొని రాజపేట మండల కేంద్రంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక పారాయణం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ప్రతి నెల పున్నమి రోజు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా జై శ్రీమన్నారాయణ భక్త బృందం సభ్యురాలు బిర్రు లక్ష్మి నివాస గృహంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ముందు సామూహిక సహస్ర పారాయణ కార్యక్రమాలు చేశారు. విష్ణు, లలితా సహస్ర పారాయణం, గోవింద నామాలు, సామూహికంగా నిర్వహించగా జై శ్రీమన్నారాయణ భక్త బృందంతో పాటు సమీప నివాస మహిళలు కూడా పాల్గొన్నారు. మంగళ హారతితో అమ్మవారిని కొలిచి తీర్థ ప్రసాద వితరణ చేశారు.



## వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు రంగ నరేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు రంగ నరేష్ అన్నారు. శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా రాజపేట మండలం పాముకుంట గ్రామంలో వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంను గ్రామ సర్పంచ్ రంగ నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్త్ క్యాంప్ లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఇలాంటి కార్యక్రమం వలన అందరికీ వైద్యం అందుతుందని పేర్కొన్నారు. బిపి, షుగర్, క్యాన్సర్, టీబీ పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా 149 మందికి టీబి స్క్రీనింగ్ చేశారు అందులో 111మందికి ఛాతి ఎక్సరే తీశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఎక్స్టెంషన్ ఆఫీసర్ భీకు నాయక్, సూపర్వైజర్ విజయలక్ష్మి, చైతన్య, ఉషారాణి,హెల్త్ అసిస్టెంట్లు ఉపేందర్, సులోచన జిల్లా టీబి సూపర్వైజర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్సరే టెక్నీషియన్ ఉమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట భారతీయ జనతా పార్టి రాజపేట మండల శాఖ అధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేకల రమేష్, సీనియర్ నాయకులు దాచేపల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ఓడ్ల గింజ కేంద్ర ప్రభుత్వం కొనడానికి సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 500 బోనస్ ఇస్తానని హామీ ఇచ్చి కేవలం సన్న వడ్లకే ఇస్తనని మాట మార్చిందన్నారు. రైతు బందు కూడ ఇవ్వడం లేదని, రైతులు దళారుల వద్ద 5 రూపాయలు వడ్డీకి తెచ్చి పండించిన పంటను ఐకెపి కేంద్రంలో విక్రయించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అమ్ముకోవడానీకి ఐకేపీ కేంద్రానికి తీసుకొస్తే కొర్రీలు పెట్టడంతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని వెంటనే చర్యలు తీసుకోకపొతే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఆర్ఐ నర్సిములు ద్వారా తహసీల్దార్ వల్లపు ప్రదీప్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దాచేపల్లి రాజు, కుమ్మరి లక్ష్మణ్, మెందు భగవాన్ రెడ్డి, సాధన బోయిన శంకర్, బూర్గు శేఖర్ రెడ్డి, అంకతి భాస్కర్, బొంగొని నరసింహులు, బెడిద కృష్ణ, చిగుళ్ల బీరయ్య, ఐరేణి శ్రీధర్, రేగొండ మాదవులు, పారుపల్లి సంజీవ రెడ్డి, సంగెమ్ వేణు, దిడ్డి సత్తయ్య, ఎండి కాజ తదితరులు పాల్గొన్నారు.




## కన్నకూతురిపై అత్యాచారం..

# తండ్రికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధించిన కోర్టు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, మెయిన్ డెస్క్:** హైదరాబాద్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఒక సంచలన తీర్పునిచ్చింది. కన్నకూతురిపైనే లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్ నగర్, గంపాల బస్తీలో నివసించే అస్గర్ అలీ (37) అనే కూలీ, తన 15 ఏళ్ల మైనర్ కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2019లో బతుకుదెరువు కోసం ఈ కుటుంబం హైదరాబాద్‌కు వలస వచ్చింది. నిందితుడు మద్యానికి బానిసై తరచూ భార్యాపిల్లలను వేధించేవాడు.గతేడాది మే నెలలో తన పెద్ద కుమార్తెపై అస్గర్ అలీ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తండ్రి బెదిరింపుల వల్ల బాధితురాలు ఈ విషయాన్ని మొదట బయటపెట్టలేదు. అయితే, చిన్న కుమార్తె ద్వారా విషయం తెలుసుకున్న తల్లి, బాధితురాలిని ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మే 6, 2025న బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో జీడిమెట్ల పోలీసులు కేసు (క్రైమ్ నం. 484/2025) నమోదు చేశారు. నిందితుడిని మే 8, 2025న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును విచారించిన మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కె. వెంకటేష్, నిందితుడు అస్గర్ అలీని దోషిగా నిర్ధారించారు. భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టం కింద నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించడమే కాకుండా, రూ. 35,000 జరిమానా విధించారు. అలాగే, బాధితురాలికి రూ. 3,00,000 పరిహారం చెల్లించాలని



న్యాయస్థానం ఆదేశించింది. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడే వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం కావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ప్రేమికురాలిని బ్లాక్ మెయిల్ చేసి

# రెచ్చగొట్టినందుకే హత్య చేసిన నాని



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట జిడ్డు నాని ప్రేమికురాలిని తాళ్లపల్లి మధు అనే వ్యక్తి బ్లాక్మెయిల్ చేసి రెచ్చగొట్టినందుకే మధును జిడ్డు నాని హత్య చేసినట్లు డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు తెలిపారు. పూర్తి విచారణ అనంతరం ఆయన సీఐ భాస్కర్, ఎస్ఐ లింగారెడ్డిలతో కలిపి మీడియా సమావేశం శనివారం నిర్వహించారు. హత్యకు కారణాలను వివరించారు. తాళ్లపల్లి మధు అతను తన తల్లి తండ్రులతో మౌలాలి, హైదరాబాద్ లో నివాసం ఉంటూ అప్పుడప్పుడు రాజపేటకి వస్తుండేవారని, కాగా మధుకి చాలా కాలంగా అతని ఇంటి దగ్గర గల జిడ్డు నాని అలియాస్ వెంకటేష్ తో పరిచయం అయ్యి ఇద్దరు కలిసి తిరిగేవారు. కలిసి పెయింటింగ్ పనికి వెళ్ళేవారు. నాని మరొక అమ్మాయి ఇద్దరు ప్రేమించుకుంటున్నారు. తాళ్లపల్లి మధు నాని ప్రేమిస్తున్న అమ్మాయికి ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడాడు అని ఆ అమ్మాయి నాని కి చెప్పగా ఎలాగైనా మధుని అడగాలని నాని మధుకి ఫోన్ చేసి రాజపేటలో పెయింటింగ్ పని ఉన్నదని చెప్పి మధును రాజపేటకి రమ్మని చెప్పగా, మూడు రోజుల క్రితం మధు రాజపేటకి వచ్చాడు. గురువారం రోజున రాత్రి మధు, నాని ఇద్దరు కలిసి మద్యం త్రాగుతున్నపుడు తన లవర్ కి ఎందుకు ఫోన్ చేశావ్ అని నాని అడుగగా మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు మధు మాట్లాడగా ఇద్దరు గొడవపడినారు. మధు నాని ని బాటిల్ తో కొట్టినాడు. ఈ విషయాన్ని మధు మనస్సులో పెట్టుకొని ఏమైనా



చేయకపోతే వాడే నన్ను ఏదోరోజు చంపుతాడు అని అనుకుని అతన్ని ఎలాగైనా చంపాలని అనుకొని 1వ, తేదీ మద్యాహ్నంశీ 1:40 గంటలకు మధు వాళ్ళ ఇంటికి నాని వెళ్లగా అక్కడ మధుతో పాటు అతని పెద్దమ్మ కొడుకు మహేష్, అతని ఫ్రెండ్ యోగేశ్వర్ కలిసి భోజనం చేస్తుండగా, మధు నానిని చూసిన మధు, ఎందుకురా మళ్ళీ నా దగ్గరికి వచ్చినవు, అంటూ అని రెచ్చగొట్టేలా మాట్లాడే సరికి, నాని కి విపరీతమైన కోపం వచ్చింది. అదే కసిలో మధు వాళ్ళ ఇంటి ముందు మూలకున్న ఇనుప పార కనిపించగా, దాన్ని అందుకుని మధు తలపై రెండు మూడు దెబ్బలు గట్టిగా కొట్టి హత్య చేసినాడు. ఈ విషయం పై హత్య నేరం, ఎస్సీ / ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ అనతరం నిందితుని శనివారం అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించగా కోర్ట్ ముద్దాయి నాని కి రిమాండ్ విధించారు. ఈ కేసును డీ.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

# ఫిర్యాదు చేసిన మృతుడు మధు అన్న భరత్...

### హత్య పై కేసు నమోదు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలో జరిగిన దారుణ హత్యపై కేసు నమోదు అయింది. రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మే 1 వ, తేది శుక్రవారం యువకుడు మధుని అతని స్నేహితుడు నాని హత్య చేసినట్లు ఆరోపణలతో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడు తాళ్లపల్లి భరత్ (28), వృత్తిరీత్యా డ్రైవర్, స్వగ్రామం రాజపేట కాగా ప్రస్తుతం హైదరాబాద్ మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇతనికి తమ్ముడు తాళ్లపల్లి మధు (25) ఉన్నాడు. మధు పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. భరత్ తన ఫిర్యాదులో తెలిపిన ప్రకారం తమ తల్లిదండ్రులు చాలా సంవత్సరాల క్రితమే ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 2019లో కరోనా లాక్‌డౌన్ సమయంలో కుటుంబ సభ్యులు రాజపేటకు తిరిగి వచ్చి, రాజపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా కొత్త కాలనీలో ఒక చిన్న ఇల్లు నిర్మించుకున్నారు. ఆ ఇల్లు ఒక్క గది మాత్రమే ఉండడంతో తల్లిదండ్రులు, తమ్ముడు మధు అక్కడే ఉండగా, భరత్ తన భార్యతో కలిసి అద్దె ఇంట్లో నివసించేవాడు. సుమారు ఏడాది క్రితం మధు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లగా, తల్లిదండ్రులు కూడా అతనితో కలిసి అక్కడే ఉండసాగారు. ఇటీవల పదిహేను రోజుల క్రితం భరత్ కూడా తన భార్యతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం మధు తన స్నేహితుడు నాని ఆహ్వానం మేరకు రాజపేటకు వచ్చాడు. తదుపరి రోజు మధు, అతని స్నేహితుడు జిడ్డు నాని, బంధువు నవీన్ కలిసి హైదరాబాద్‌కు వెళ్లి కొన్ని దుస్తులు తీసుకుని తిరిగి రాజపేటకు చేరుకున్నారు. ఏప్రిల్ 30వ, తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో మధు తన తల్లితో ఫోన్‌లో మాట్లాడి, తాను జిడ్డు నానితో కలిసి రాజపేటలో ఒక ఇంటిలో పెయింటింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపాడు. జిడ్డు నాని, మధుతో చాలా కాలంగా స్నేహం ఉందని పేర్కొన్నారు. అయితే మే 1వ, తేదీ శుక్రవారం మధ్యాహ్నం సుమారు 1:40 గంటల సమయంలో జిడ్డు నాని, మధు మధ్య ఏదో విషయంపై గొడవ చోటుచేసుకుని, ఆగ్రహంతో నాని పారతో మధుపై దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని తాళ్లపల్లి బబ్లు అనే వ్యక్తి ఫోన్ ద్వారా భరత్‌కు తెలియజేశాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే భరత్ తన తల్లిదండ్రులు, భార్యతో కలిసి రాజపేటకు చేరుకుని, తమ ఇంట్లో మధు మృతదేహాన్ని గుర్తించారు. హత్యకు గల కారణాలు ఇప్పటికీ తెలియరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజపేట పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## పదిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను

# సత్కరించిన సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని జెతురం తండా గ్రామపంచాయతీ మరియు సంగ్య తండా మొత్తం15 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు, అందులో అందరు పాస్ అవడం జరిగింది, భూక్య ఇందు 567 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు, నూనావత్ నందు, భూక్య సిరి మల్లిక, భూక్యా మేఘన, నూనావత్ చరణ్, భూక్య విజయ్, నూనావత్ మజ్ను, భూక్యా ధనుష్ ,లకవత్ విజయ్, భూక్యా భాష, భూక్య నందిని, భూక్యా మన్ సింగ్, నూనావత్ రక్షిత, అందరూ మంచి మార్కులతో పాస్ అవడం చాలా సంతోషకరమైన విషయం, ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ దీనికి మూల కారణం మా యొక్క గ్రామ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ ఉదయం రాత్రి మమ్మల్ని స్టడీ అవర్స్ లో కూర్చోబెట్టి, పరీక్షలు ఏ విధంగా రాయాలి, పరీక్షకు ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలి ఇలా అనేక విషయాలు ఎప్పటికప్పుడు మమ్మల్ని ఉత్తేజపరుస్తూ మోటివేషన్ చేస్తూ ప్రోత్సహించడం జరిగింది, వారికి మా అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, చదువుకున్నవారు ఇలాంటి సర్పంచ్ ఉంటే ఆ గ్రామం యొక్క రూపు రేఖలు మారుతాయి అని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ మా గ్రామ పంచాయతీలో మంచి మార్కులతో అందరూ పాస్ అవడం చాలా సంతోషకరమైన విషయం, విద్యార్థులు నేను చెప్పినట్టుగా క్రమశిక్షణతో మెలుగుతూ ఆచరించడం నాకు చాలా సంతోషం అనిపించింది, భవిష్యత్తులో వాళ్ళు ఏ చదువు చదివిన వారి వెంట



నేనుంటాను, వారికి ఉద్యోగాలు వచ్చేంతవరకు వారికి నా సపోర్ట్ ఉంటుంది, విద్య ద్వారా మాత్రమే మన బతుకులు బాగుపడతాయి అది నేను బలంగా నమ్ముతాను, ఇక్కడ తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం చేత పిల్లల్ని పట్టించుకునే నాధుడు లేదు, అందుకే వారిపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించి వారిని అత్యంత స్థానములో తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని తెలియజేశారు

## గుడ్ న్యూస్: 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో..

# హార్ముజ్ దాటిన భారత నౌక..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. భారత్ లోనూ గ్యాస్, చమురు సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధం కారణంగా ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయగా ఉన్న హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ఇప్పుడు ఆ జలసంధిపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. ఈ తరుణంలో భారత్ కు గుడ్ న్యూస్. భారత్ కు చెందిన 'సర్వ్ శక్తి' నౌక తాజాగా హార్ముజ్ జలసంధిని దాటినట్లు తెలుస్తోంది. ఈ నౌక దాదాపు 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీని మోసుకొస్తోంది. ఈ నౌకలో ఎల్పీజీతోపాటుగా భారత సిబ్బంది కూడా ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నౌక తన ఆటోమెటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ద్వారా ఇండియా క్రూ అని సందేశాన్ని పంపించింది.ఇక 'సర్వ్ శక్తి' నౌక ప్రస్తుతం లారక్ ఐలాండ్ ను దాటి ఒమన్ గల్ఫ్ వైపు ప్రయాణిస్తోంది. ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సూచించిన సురక్షిత మార్గంలోనే ఈ నౌక ప్రయాణిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఈ నౌకలో దాదాపు 46,313 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు సమాచారం. ఈ నౌక మే 13 తేదీ నాటికి విశాఖ తీరానికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇరాన్- అమెరికా మధ్య చర్చలు విఫలం కావడంతో హార్ముజ్ పై అమెరికా దిగ్బంధనం విధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత భారత్ కు చేరుకుంటున్న తొలి ఎల్పీజీ నౌక ఇదే కావడం విశేషం. ఇక ఈ నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 18 మంది భారతీయులని తెలుస్తోంది.ఇక అంతర్జాతీయ మీడియా సంస్థ అయిన బ్లూమ్ బర్గ్ కథనం ప్రకారం.. భారత్ లోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈ సరుకును కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని కంపెనీ ఇప్పటి వరకు ధృవీకరించలేదు. మరోవైపు ప్రస్తుతం భారత్ లో గ్యాస్ సంక్షోభం ఉన్న నేపథ్యంలో ఈ నౌక భారత్ కు చేరుకుంటే ఎల్పీజీ సరఫరాలో కాస్త ఉపశమనం లభించే అవకాశం ఉంది.




### చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

## ఎస్ఎస్సీ ఫలితాల్లో అద్భుత ఫలితాలు


G. SRAVANTHI - 567/600


S. VAISHNAVI - 551/600


S. AKSHAYA - 548/600


S. AKSHITHA - 529/600


K. BHULAXMI - 529/600


G. BHARATH KUMAR - 527/600


K. CHAITHANYA - 517/600


G. ARAVIND - 505/600


G. MANOJ REDDY - 503/600

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలు -- మార్చి 2026లో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 28 మంది విద్యార్థులు 28 మంది ఉత్తీర్ణులు కావడంతో పాఠశాల 100 శాతం ఫలితాన్ని నమోదు చేసింది. గత సంవత్సరం కూడా పాఠశాల 100 శాతం ఫలితాన్ని సాధించడం ప్రత్యేకత. ఈ పాఠశాలకు చెందిన జి. స్రవంతి 600 మార్కులకు గాను 567 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం, జిల్లా స్థాయిలో ఎనిమిదో స్థానం సాధించింది. అలాగే పాఠశాల నుండి మొత్తం 9 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వారు:ఎస్. వైష్ణవి - 551, ఎస్. అక్షయ - 548, కె. భూలక్ష్మి - 529, ఎస్. అక్షిత - 529, జి. భరత్ కుమార్ - 527, కె. చైతన్య - 517, జి. అరవింద్ - 505, జి. మనోజ్ రెడ్డి - 503 మార్కులు సాధించారుఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బీమగాని రూప బాల నర్సయ్య దంపతులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. వసంత, ఉపాధ్యాయులు పీ. రాజు, ఏ. సత్తి రెడ్డి, కె. రమేష్, జి. సుశీల, టీ. వీరభద్రం, కె. అమరేందర్ రెడ్డి, కె. నామ్‌దేవ్, కె. వరలక్ష్మి, డి. కృష్ణవేణి, డి. వినయ్ కుమార్, ఏ. సారంగపాణి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను సర్పంచ్, ఇతరులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారంతో ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ విజయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఇమ్మిడి గార్డెన్స్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆలేరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మహిళ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బండ్రు శోభారాణి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఏర్పాటు చేసిన పలు ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు తమ అనుభవాలను స్వయంగా వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల తమ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ముఖ్యంగా భావించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన వ్యక్తికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామాల్లో అట్టడుగు లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్న ఒడ్లకు బోనస్, ఉచిత బస్సు సేవలు వంటి పథకాలు ప్రజలకు చేరుతున్నాయా అనే విషయాన్ని సమీక్షించినట్లు పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలపరచి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఐకేపీ మహిళా సంఘాలకు ఎక్కువగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొని, మొలకలు వచ్చిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఆ సమయంలో రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వచ్చిందని, ఇప్పుడు అదే ప్రభుత్వం రైతుల ధాన్యం కొనుగోలు కోసం ధర్నాలు చేయడం విడ్డూరమని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గంలో సుమారు 15 వేల రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని, 22 వేల మందికి పైగా పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్చినట్లు తెలిపారు. రేషన్ కార్డు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని, విద్య మరియు ఉపాధి అవకాశాలకు కూడా ఇది కీలకమని పేర్కొన్నారు. గత పదేళ్లలో అందని నిధులను ఈ రెండేళ్లలో తీసుకువచ్చామని, సంక్షేమం అనేది ధనికుల కోసం కాకుండా పేదల కోసం ఉండాలని స్పష్టం చేశారు. పార్టీ భేదాలు పక్కనబెట్టి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



## అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ స్వాములతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్నలిస్ట్ భైరి విశ్వనాథం గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మామిడాల భానుచందర్, చాడ రాజు, కొల క్రాంతి కుమార్, పరదే కరుణాకర్, గంధమల్ల క్రాంతి కుమార్, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత, పవర్లూమ్ కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో ఈ నెల, 4 వ తేదీ సోమవారం రోజున ఉదయం 9 గంటల నుండిమధ్యాహ్నం 3 గంటల వరకు పద్మశాలి భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుంది, ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు, కంటి డాక్టరు, ఆర్థోపెడిక్ డాక్టర్స్, పాల్గొంటారు. శిబిరంలో అన్ని రకాల రోగాలకు రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేస్తారు, కాబట్టి మండలంలోని చేనేత, పవర్లూమ్ కార్మికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు కార్మికులను కోరారు.

## సీలింగ్ భూముల కబ్జాపై విచారణ జరపకపోతే ఉద్యమం

### బీఆర్ఎస్ నేత కర్రె వెంకటయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సీలింగ్ భూముల కబ్జాపై సమగ్ర విచారణ జరపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల ఆధ్యక్షుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. శనివారం పట్టణంలో మీడియాతో మాట్లాడారు.యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం, మాసాయిపేట గ్రామాల్లో సర్వే నంబర్లు 322, 728ల పరిధిలో ఉన్న సుమారు 1200 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అక్రమంగా వెంచర్ గా అభివృద్ధి చేశారని ఆరోపించారు. నిరుపేదలకు ప్లాట్లు కేటాయించినప్పటికీ వాటి స్థితి స్పష్టంగా లేదని తెలిపారు. ఒక్కో ప్లాట్‌ను పలువురికి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలూ ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశంపై రెండు వారాల క్రితం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకారెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు విచారణ జరగలేదని విమర్శించారు. అధికార యంత్రాంగం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, ఏసీబీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకటించిన ఆస్తులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాపట్ల నరహరి, ముక్కర్ల సతీశ్ యాదవ్, కల్వకొలను సతీశ్ భట్, జీ.రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.